క్లుప్తంగా

పూడిమడక రోడ్డు విస్తరణకు సహకరించాలి



మునగపాకలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు మునగపాక కృష్ణంరాజు కాలువ వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. రహదారి విస్తరణలో భాగంగా బ్రిడ్జి దరి కోల్పోతున్న భవనాలను సందర్శించారు. బాధితులకు మెరుగైన పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, మొల్లేటి ఆనంద్, ఆడారి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డురోడ్డులో ట్రాఫిక్ సమస్య



అడ్డురోడ్డు ఫ్లైఓవర్ కింద అడ్డదిడ్డంగా ఆపిన వాహనాలు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనచోదకులు వాణిజ్య సముదాయాల ముందు అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపేస్తున్నారు. అలాగే ఇక్కడున్న ఫ్లైఓవర్ కింద కూడా వాహనాలను యథేచ్ఛగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పార్కింగ్ లేని చోట వాహనాలు నిలపకుండా చేసి, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా సభలు

యలమంచిలి రూరల్: సీపీఐ అనకాపల్లి జిల్లా 2వ మహాసభలు సోమవారం నుంచి యలమంచిలిలో ప్రారంభమవుతాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న మహాసభల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4.30 గంటలకు యలమంచిలి గుర్రప్ప సత్రం నుంచి ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగర్, ఎల్ఐసీ కూడలి మీదుగా తిరిగి గుర్రప్ప సత్రానికి ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ర్యాలీ అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య హాజరవుతారన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పార్టీ శ్రేణులను కోరారు.

కొత్తమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

ఎస్.రాయవరం: వెంకటాపురం గ్రామదేవత కొత్తమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం దంపతులు ఆదివారం భూమి పూజ చేశారు. అమ్మవారి ఆలయం ఇరుకుగా, లోతట్టు ప్రాంతంలో ఉండడంతో కొత్త ఆలయం నిర్మాణం చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఇప్పటికే అమ్మవారి ప్రతిమలు సమీపంలో నీడ ఏర్పాటు చేసి భద్రపరిచారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనకు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మరిశా రమణమూర్తి, త్రీమూర్తులు, స్థానిక నాయకులు అబద్ధం, కొప్పిశెట్టి కాలి, సిదిరెడ్డి జోగిరాజు, కొండలరావు, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సిక్ లీవ్స్‌కు పూర్తి జీతం చెల్లించాలి



డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: ఉద్యోగుల సిక్ లీవ్స్‌కు పూర్తి జీతం చెల్లించాలని ఎన్ఎంయూఏ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 65వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేసి, డిపో మార్చిన కండెక్టర్, డ్రైవర్లను యథావిధిగా ఇక్కడి డిపోలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎ.ఎస్.రావు, వి.ఆర్.ఎస్.ఎస్.రావు, కె.వి.లక్ష్మి, సీహెచ్.సత్యవతి, బి.ఎ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విజ్ఞానం వినోదం

ఏడాదంతా చదువులు, పరీక్షల్లో నిమగ్నమైన విద్యార్థులు వేసవి సెలవులనగానే ఎగిరి గంతేస్తారు. ఆటలు, వినోదానికే మొత్తం సమయం కేటాయిస్తారు. అయితే వేసవిలో వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేలా ఏర్పాటు చేసినవే వేసవి విజ్ఞాన శిబిరాలు. ఆధునిక యుగంలో పుస్తక పఠనానికి దూరమైన పిల్లలకు వాటిని అలవాటు చేసేందుకు, గ్రంథాలయాల్లో లభ్యమయ్యే అపార విజ్ఞాన సంపదను వారికి పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాలు ఏప్రిల్ 28 నుంచి ప్రారంభమయ్యాయి.

- విద్యార్థుల్లో నూతనోత్తేజం
- సెలవులు సద్వినియోగం





అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

నక్కపల్లి/అచ్యుతాపురం: పరీక్షల అనంతరం విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరం పేరుతో పౌర గ్రంథాలయాల శాఖ 40 రోజుల క్యాంపులు నిర్వహిస్తోంది. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరాల్లో చిన్నారులతో పాటు యువత, పెద్దలకు భాగస్వామ్యం కల్పిస్తోంది.

కథలతో స్ఫూర్తి, విలువలు

కథలు స్ఫూర్తినివ్వడంతో పాటు విలువలను నేర్పిస్తాయి. చిన్నతనంలో విన్న కథలు వారిని వివేకవంతులుగా మారుస్తాయి. ముఖ్యంగా పదేళ్ల లోపు పిల్లల్ని ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకోవచ్చు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వ్యామోహం, అర్థం పర్థం లేని టీవీ సీరియళ్లు, వాట్సాప్, ఫేస్‌బుక్, వీడియో గేమ్‌లు, అరచేతిలో ఇంటర్నెట్ వంటి సాధనాలు మనుషులు దగ్గరగా ఉన్నా మనసులను దూరం చేశాయి. ఈ వేసవి సెలవులను చిన్నారులు వరంగా మార్చుకుని, మెదళ్లకు పదునుపెట్టి కళాత్మకంగా మారడానికి వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయి. ఒత్తిడి పెంచే చదువులు, మార్కులే పరమావధి అయిన ఈ రోజుల్లో కథల పుస్తకాలు స్ఫూర్తి నింపుతాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు సైతం ధ్రువీకరిస్తున్నారు. చిన్నారుల మనసులలో కల్మషాలను దూరం చేయడానికి నీతికథలు పని చేస్తాయంటున్నారు.

నైపుణ్య వృద్ధి.. సృజనాత్మక శక్తి

విద్యార్థుల్లో నేర్చుకోవడం, మాట్లాడటం, చదవడం, రాయడం (ఎల్ఎస్ఆర్‌డబ్ల్యూ) వంటి ప్రాథమిక నైపుణ్యాలతో పాటు సృజనాత్మకతను పెంపొందించే అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. కథలు వినిపించడం ద్వారా శ్రవణం, పుస్తకాలు చదివించడం ద్వారా పఠనం, కథలు చెప్పడం ద్వారా మాట్లాడటం, జ్ఞాపకశక్తి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇవే కాకుండా సాహిత్య అభిలాష కలిగిన వారితో పుస్తకాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా చిన్నారులకు ప్రయోజనం కలిగించే స్పోకెన్ ఇంగ్లిష్, వారిలో సృజనాత్మకతతో పాటు కళలు, క్రీడల్లోనూ ఆసక్తి కలిగించేలా డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, బొమ్మల తయారీ, చెస్, క్యారమ్స్, క్విజ్, జనరల్ నాలెడ్జ్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

అందుబాటులో పుస్తకాలు

నక్కపల్లి మండలం చిన దొడ్డిగల్లు గ్రంథాలయం, అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేలాది పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో వార్తాపత్రికలు, మాస పత్రికలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, హాస్యకథలు, బీర్బల్, తెనాలి చమత్కారాలు, పేదరాశి పెద్దమ్మ, మర్యాద రామన్న, పరమానందయ్య శిష్యుల కథలు, మత గ్రంథాలు, చరిత్ర, మహనీయుల జీవిత చరిత్రలు, నవలలు, తత్వ గ్రంథాలు వంటివి ఉన్నాయి. గ్రామంతో పాటు అంటుబాటులో మ్యాపింగ్ చేయబడిన 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బంధువులను ఈ వేసవి సెలవుల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు గ్రంథాలయానికి రప్పించేందుకు ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలకు హాజరైన విద్యార్థులు

విజ్ఞానానికి వేసవి శిబిరాలు దోహదం



సెలవుల అనంతరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. స్పోకెన్ ఇంగ్లిషు, తెలుగు భాషపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. గ్రంథాలయంలో ఎన్నో మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా ఉన్నత చదువులకు మంచి విజ్ఞానాన్ని పెంచుకునే అవకాశం కలుగుతోంది. గత రెండేళ్ల నుంచి ఈ శిబిరాలకు హాజరవుతున్నాను.

– కట్టా హేమ, 9వ తరగతి, చినదొడ్డిగల్లు

కథల పుస్తకాలు బాగున్నాయి..



గ్రంథాలయంలో మంచి కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని రోజు చదివిస్తున్నారు. మాలో సృజనాత్మకత, పోటీతత్వాన్ని పెంచేందుకు చిత్ర లేఖనం, పేపర్ క్రాఫ్ట్ తయారీ, క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ అంశాలపై క్విజ్ పోటీలు కూడా పెడుతున్నారు. వా రం రోజులుగా సమ్మర్ క్యాంపునకు వెళ్తున్నా. కార్యక్రమాలు చాలా బాగున్నాయి.

– కె.నందిని లక్ష్మి, విద్యార్థిని, చినదొడ్డిగల్లు

వేసవి శిబిరాలకు విశేష స్పందన



వేసవి శిబిరాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం, పద్య పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటు దేశ నాయకుల జీవిత చరిత్ర, ఉన్నత చదువుల కోసం ప్రణాళికలు, ఆట పాటలు, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఈ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. సుమారు 50 మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు. స్థానిక ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని ఈ శిబిరాలను కొనసాగిస్తున్నాం.

–కె.జనార్దన్, గ్రంథాలయాధికారి, చినదొడ్డిగల్లు

క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం..



ప్రతి యేటా క్రమం తప్పకుండా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. చుట్టు పక్కల విద్యార్థులు స్వచ్ఛందంగా వస్తున్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి బడ్జెట్ కేటాయిస్తే బాగుండును. వేసవిలో పిల్లలు పక్కదారి పట్టకుండా ఈ తరగతులు దోహదపడతాయి. చిన్నారులకు ఆట, పాటలతో వారిలో ఉత్సాహం నింపుతున్నాం.

–కోటేశ్వరరావు, లైబ్రేరియన్, అచ్యుతాపురం శాఖ గ్రంథాలయం



చిన దొడ్డిగల్లు గ్రంథాలయం

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థిని



పాయకరావుపేట గ్రంథాలయంలో వేసవి శిబిరంలో చిన్నారులు

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడంపై గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో గ్రంథాలయ సందర్శన చాలా ముఖ్యమన్నారు. మంచి పుస్తకాలు చదవడం ద్వారా మంచి నడవడిక, వ్యక్తిత్వ వికాసం కలుగుతాయన్నారు. కథలు చదవడం, వినడం, చెప్పడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పుట, డైరీ రాయించడంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు హిందీ గ్రామర్, ఇంగ్లిష్ గ్రామర్, విద్యార్థులకు యోగా శిక్షణ, కుర్చీల ఆట, వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌లుగా ఎస్.సీతారామమూర్తి, రాజు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వామా లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమిపై ప్రజాగ్రహం

- 11 నెలల్లోనే తీవ్ర అసంతృప్తి
- 20 అడుగుల గోడ కట్టలేని వ్యక్తి అంతర్జాతీయ రాజధాని కడతాడట
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్
- సబ్బవరం పార్టీ కార్యాలయం ప్రారంభం



బూడి ముత్యాలనాయుడుతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమర్, అదీప్

సబ్బవరం: 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. సబ్బవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుతో కలిసి ఆయన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వేలాది మంది అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావడం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. 'మన ప్రభుత్వం అధికారంలో ఉన్న నాలుగున్నరేళ్లలో ప్రతిపక్షాలకు సమావేశాలు నిర్వహించడానికి కూడా అవకాశం లేకుండా జగన్ మోహన్ రెడ్డి పాలన సాగించారు. ప్రజల పక్షాన పోరాడేందుకు ఏ ఒక్క సమస్య కూడా లేకుండా చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని అమర్‌నాథ్ ఆరోపించారు. సింహాచలం చందనోత్సవంలో జరిగిన అపశ్రుతిని ప్రస్తావిస్తూ, 20 అడుగుల గోడ కట్టలేని చంద్రబాబు అంతర్జాతీయ రాజధాని కడతానంటే భయమేస్తోంది. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారు?' అని ఆయన ప్రశ్నించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని, స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారే నాయకుల వల్ల నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందని, ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల్లో విశ్వాసం నిలిపిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజలకు ముఖం చాటేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. పార్టీ కార్యక్రమానికి పిలుపునిచ్చిన తక్కువ సమయంలో ఇంత భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులను భారీ బైక్ ర్యాలీతో పార్టీ కార్యాలయానికి ఆహ్వానించారు. పార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, పార్టీ అధికార ప్రతినిధి పైలా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శరగడం చినప్పలనాయుడు, పార్టీ సీయూసీ సభ్యులు బైలపూడి భగవాన్ జయరాం, మాజీ జడ్పీటీసీ కోటాన రాము, పి. సురేష్ రాజ్, ఉప్పిలి కనకరాజు, సబ్బవరం ముత్యాలనాయుడు, చోప్పా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దిమిలి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సందడి

రాంబిల్లి(అచ్యుతాపురం): యాభై ఏళ్ల క్రితం వారంతా ఆ బడిలో పదో తరగతి చదువుకున్నారు. వృత్తి, ప్రవృత్తి రీత్యా ఎక్కడో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న బడిలో చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రాంబిల్లి మండలంలోని దిమిలి ఉన్నత పాఠశాలలో 1974–75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం తమ బడిలో స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను వారంతా సత్కరించారు.

ప్రతిభ చూపిన 'పది' విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న తంపరమూల రైతు సంఘం అధ్యక్షుడు జగన్

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని తంపరమూల రైతు సంఘం అధ్యక్షుడు శరగడం జగన్ అన్నారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించిన ఆడారి లక్ష్మీగణేష్, బుదిరెడ్డి రేణుక, టెక్కలి భాగ్యశ్రీలను ఆదివారం సంతబయిల రామాలయం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో చదువులో రాణించాలంటే ఏకాగ్రత ఒక్కటే మార్గమన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా కష్టపడి చదువుకోవాలన్నారు. ఉన్నత చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేగుల మణికంఠ, దాడి నాయుడు, ఆడారి గోవింద, దాడి మురళి, ఆడారి సూరిబాబు, భాగ్యరాజ్, సూరిశెట్టి ప్రసాద్, భీశెట్టి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జూడోలో ఉచిత శిక్షణ

నర్సీపట్నం : డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ వారి సౌజన్యంతో ఆర్‌పి మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఉచిత జూడో సమ్మర్ క్యాంపును ఆదివారం ప్రారంభించారు. ఈ క్యాంపును మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ వెలగా నారాయణరావు, ఫార్మర్ డైరెక్టర్, సీనియర్ కోచ్ తోట ప్రసాద్ ప్రారంభించారు. జూడో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నారాయణరావు విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు జూడోలో తర్ఫీదు ఎంతో ఉపకరిస్తుందన్నారు. డైరెక్టర్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు శిక్షణ ఉంటుందన్నారు.

వైభవంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ కమిటీ సభ్యులు



దుర్గాదేవికి జలాభిషేకం చేయడానికి నీళ్ల బిందెలతో తరలివస్తున్న మహిళా భక్తులు



భక్తులతో కిక్కిరిసిన ఆలయం

యలమంచిలి రూరల్: మండలంలోని పద్మనాభరాజుపేటలో ఆదివారం దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పసుపు, వేప కొమ్మలతో శుద్ధిచేసిన నీటిని బిందెలతో తీసుకువచ్చి అభిషేకం చేశారు. పసుపు కుంకుమలు, చీర రవికె, గాజులు, నల్లపూసలు పెట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, నేలవేషాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అనంతరం మధ్యాహ్నం భారీ ఎత్తున భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వల్పంగా తోపులాట చోటు చేసుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.

యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా



వరాహ నదిలో నీటి అడుగు భాగం నుంచి ఇసుక తీసి నాటుబళ్లతో తరలిస్తున్న దృశ్యం



జేవీ పాలెంలో గ్రావెల్ తరలించిన ప్రదేశం

ఎస్.రాయవరం: మండలంలో ఇసుక, గ్రావెల్ దందాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. దార్లపూడి నుంచి వరాహ నదిలో పైకి ఇసుక కనిపించకపోయినా నీటి అడుగున ఉన్న గర్భం నుంచి తవ్వి ఇసుక తీస్తూ తరలిస్తున్నారు. స్థానిక అవసరాలకు చెబుతూ నాటు బళ్లతో నుంచి తీసి ట్రాక్టర్లు, లారీల ద్వారా బడా బిల్డర్స్‌కి తరలిస్తున్నారు. రాజమండ్రి నుంచి వచ్చే ఇసుక కాస్త రేటు ఎక్కువగా ఉండటంతో అక్రమ మార్గాలు ద్వారా వచ్చే ఇసుకను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో నదిలో తాగునీటి పైపులైనులను సైతం తవ్వి పాడు చేస్తున్నారు. అక్రమార్కులకు కూటమి నాయకుల అండ ఉండడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇసుక అక్రమ రవాణాదారులు ఇష్టం వచ్చినట్టు పేట్రేగిపోతున్నారు. అదే క్రమంలో గ్రావెల్ దందాదారులు గుడివాడ శివారులో కొత్తపోలవరం వద్ద గుట్టుచప్పుడు కాకుండా రాత్రుళ్లు జేసీబీ ఉపయోగించి, సమీప కంపెనీలకు పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. దార్లపూడి పోలవరం కాలువ తవ్వకాల్లో వచ్చిన గ్రావెల్ తరలింపునకు అడ్డూఅదుపూ లేదు. ఈ సమస్యను రెవెన్యూ అధికారుల వద్ద ప్రస్తావించినా, తాము అడ్డుకునే సమయంలేదని, వీఆర్‌ఏలను పంపిస్తామని సమాధానం ఇస్తున్నారు. ఇదే అదునుగా కూటమి నేతలు అక్రమ వ్యాపారాలపై కన్నేసి జోరుగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించి మండలంలో జరుగుతున్న అక్రమ రవాణా దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

వెంకన్న ఆలయానికి రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న అప్పలనాయుడు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో తలపెట్టిన ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వామ్యులవుతున్నారు. మునగపాకకు చెందిన దొడ్డి జగ్గప్పారావు కుమారుడు అప్పలనాయుడు ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా రూ.10లక్షలు ఆదివారం విరాళంగా ప్రకటించి అడ్వాన్స్ కింద రూ.5లక్షల చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. కాకి రమేష్, రాజేశ్వరి దంపతులు రూ.10,011, వెలగా అప్పలనాయుడు, సత్యవతి దంపతులు రూ.10 వేలు, దాడి చంద్రరావు, మల్లీశ్వరి దంపతులు రూ,12,078 చొప్పున విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంటకోట వెంకటరావు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట ఉమేష్, జల్లేపల్లి కిష్టప్ప, విల్లూరి నూక నరసింగరావు, టెక్కలి గంగునాయుడు, విల్లూరి మోహన్, బొడ్డేడ రామునాయుడు, చంద్రపాటి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామివారికి అష్టోత్తర శతనామా వళి పూజ భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ ఆర్జిత సేవలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అంతేకాకుండా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది.